ప్రజాశక్తి
గురువారం 12 జనవరి 2023
5
శ్రీకాకుళం



అన్ లోడ్ చేయడంలో జాప్యం వద్దు

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యాన్ని మిల్లుల వద్ద అన్ లోడ్ చేయడంలో గానీ, ఎఫ్‌సిఐకి బియ్యం పంపించడంలో గానీ జాప్యం కారాదని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో భాగంగా జిల్లాలోని పలు రైస్ మిల్లులను ఆకస్మిక తనిఖీ చేస్తున్న జెసి, బుధవారం నరసన్నపేటలోని వెంకట నాగేశ్వర, వెంకటలక్ష్మి రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. ఎఫ్‌సిఐకి బియ్యం పంపించడంలో జాప్యం కావడంపై విచారించి పలు సూచనలు చేశారు. అనంతరం శ్రీకాకుళం రూరల్ మండలం శిలగాం సింగువలస ఎఫ్‌సిఐ గోదాముకు వెళ్లి మిల్లుల నుంచి వచ్చిన ధాన్యం లోడులను పరిశీలించారు. అన్ లోడ్ చేయడంలో జాప్యం కారాదని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా సరఫరాల అధికారి డి.వెంకటరమణ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'యువశక్తి'



- హాజరు కానున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ యంత్రాంగం
- సభాస్థలిని పరిశీలించిన ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, లావేరు

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గురువారం జిల్లాకు రానున్నారు. లావేరు మండలం తాళ్లవలస సమీపంలో నిర్వహించనున్న 'యువశక్తి' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడనున్నారు. ఇందుకు సంబంధించి పార్టీ నాయకత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సభా ప్రాంగణంలో పెద్దపెద్ద ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. సభకు లక్ష మందికి పైగా వస్తారని పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. యువశక్తి కార్యక్రమం ఉదయం 12 గంటలకు ప్రారంభం కానుంది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల మధ్య అధినేత సభావేదిక వద్దకు చేరకుంటారని నాయకులు చెప్తున్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి యువత, సాధారణ జనం తరలివస్తారని చెప్తున్నారు. అందుకనుగుణంగా పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు. పవన్ కళ్యాణ్‌తో నేరుగా మాట్లాడేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వంద మంది యువతీ, యువకులను ఎంపిక చేశారు. నిరుద్యోగ సమస్య, నోటిఫికేషన్లు ఇవ్వకుండా ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేయడం, ఇతర సమస్యలపై మాట్లాడేలా సిద్ధం చేశారు. దీంతో పాటు మత్స్యకార యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వలసలు తదితర అంశాలపైనా చర్చించనున్నారు. సభకు వచ్చే జనాలకు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన అభిమానులు స్వచ్ఛందంగా భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. భోజనాలను ప్యాకింగ్ చేసి నేరుగా పంపిణీ చేయనున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన పార్టీ నేతలు

యువశక్తి సభా ఏర్పాట్లను పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్, పార్టీ నేత కె.నాగబాబుతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇరువురు నేతలు మాట్లాడారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేపడుతున్న యువశక్తి బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. మూడు జిల్లాల్లో ఉన్న జనసేన కార్యకర్తలు ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. యువతకు వర్తమాన రాజకీయాల్లో మార్పు తెచ్చేది 'యువశక్తి' అని అన్నారు. యువత దేశానికి వెన్నుముఖ, అటువంటి యువత నేడు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కొరవడి తల్లడిల్లుతున్నారు. యువత గోడు పాలకులకు పట్టకపోవడంతో వారు పడరాని పాట్లు పడుతున్నారు. ఉద్యోగాలు దొరక్క తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారని చెప్పారు. అందులో భాగంగానే యువత కోసం జనసేన పార్టీ గళమెత్తనుందని చెప్పారు

సభకు భారీ పోలీసు బందోబస్తు

'యువశక్తి' సభకు లక్ష మందికిపైగా తరలివస్తారన్న అంచనాతో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. విధులకు సుమారు 500 మందిని నియమించినట్లు తెలిసింది. జిల్లా ఎస్‌పి జిఆర్ రాధిక బుధవారం సభా ప్రాంగణాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సభ నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. మధ్యాహ్నం శ్రీకాకుళం డిఎస్‌పి మహేంద్ర వేదిక ప్రాంతానికి చేరుకుని పలు సూచనలు చేశారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కొత్తకోట అప్పారావు

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - టెక్కలి

సంక్రాంతి సంబరాల్లో భాగంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యాన టెక్కలి నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలను విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి కొత్తకోట అప్పారావు బుధవారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. పలు సమస్యలపై పోరాటాలతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ కమిటీని అభినందించారు. గ్రామీణ క్రీడలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలన్నారు. యువత ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక సమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.గణేష్ మాట్లాడుతూ నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు జి.రాజేష్ ఆధ్వర్యాన పోటీలు నిర్వహించగా, వ్యాయామ ఉపాధ్యాయులు రఘు, శ్యామ్, జె.జె రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు మెజ్జాడ శివ, సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు, విశ్రాంత ఉపాధ్యాయులు ఎం.గణపతిరావు, హెచ్.ఈశ్వరరావు, కె.ఎల్లయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు యు.దుర్గాప్రసాద్, చందు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబరు 1967

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పౌరసరఫరాలు, ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 1967కు ఫోన్ చేసి వివరించవచ్చని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ, ధాన్యం కొనుగోళ్లు, లీగల్ మెట్రాలజీ, వినియోగదారుల రక్షణ తదితర సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

జానపదం సంస్కృతిలో భాగం

- ప్రజా గాయకుడు గద్దర్
- జానపద కళలకు పుట్టినిల్లు సిక్కోలు
- మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

జానపదం ప్రజా సంస్కృతిలో భాగమని ప్రజా గాయకుడు గద్దర్ అన్నారు. జానపద కళారూపాలు కొత్త పుంతలు తొక్కుతూ ఒక తరం నుంచి మరొక తరానికి వారసత్వ సంపదగా అందుతున్నాయని చెప్పారు. మండలంలోని చిన్న నీలావతి గ్రామంలో సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో బుధవారం సిక్కోలు జానపద కళాజాతర నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గద్దర్ మాట్లాడుతూ కళ కళ కోసం కాదు.. ప్రజల కోసమని తన ఆట, పాటలతో ప్రజలను ఉత్తేజపరిచారు. సోషల్ మీడియా, పాశ్చాత్య నాగరికత జానపద సంస్కతి, మానవ నైతిక విలువలపై తీవ్ర ప్రభావం చూపాయని చెప్పారు. మనిషి కష్టించే తత్వానికి, సమిష్టి సంఘ జీవనానికి దోహదపడే జానపద కళలు ప్రమాదపు అంచున ఉండటం ఆలోచించదగ్గ విషయమన్నారు. సిక్కోలు ప్రాంత కళాకారులు పాటలు రూపంలో పాడుతున్న పాటలు ప్రపంచ నలుమూలలకు వ్యాపిస్తున్నాయని, సినిమాలలో ఆ పాటను తీసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ కళలకు పుట్టినిల్లు సిక్కోలు అని అన్నారు. బానిస బతుకుల విముక్తి కోసం పెన్ను, గన్ను పట్టిన ఎంతోమంది ప్రాణ త్యాగం చేసిన నేల ఇదని అన్నారు. ఈ చరిత్రను భవిష్యత్ తరానికి అందివ్వాలనే తాపత్రయం నుంచి పుట్టుకొచ్చిన జానపద సాహిత్య కళావేదిక సభ్యులను అభినందించారు. ప్రజా గాయకులు వంగపండు ఉష, ఏపూరి సోమ్మన్న మాట్లాడుతూ సాయుధ విప్లవ ఉద్యమాలకు ఉద్దాన ప్రాంతం బాటలు వేసిందని కొనియాడారు. పల్లె జీవన విధానంతో ముడిపడి ఉన్న జానపద కళలు కాపాడుకునేందుకు, భవిష్యత్ తరానికి అందించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ జానపదాలు భవిష్యత్ తరానికి బాటలు వేస్తాయన్నారు. ప్రస్తుత తరుణంలో కళలు, సాంప్రదాయాలు, సాహిత్యం కనుమరుగుతున్న తరుణంలో జానపద కళా జాతర నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నీలావతి సర్పంచ్ ప్రతినిధి సొర్ర తిరుపతిరావు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎంపిపిలు ఉంగ సాయికృష్ణ, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, ఒక్కరి దానయ్య, రాపాక బత్తిన రామారావు, మల్లెను దేవరాజ్, బొడ్డు గాంధీ, కె.వినోద్, గేదెల తులసయ్య, కోశాధికారి మామిడి కష్ణారావు, సలహాదారులు దాసరి తాతారావు, పి.విఠల్‌రావు, విశ్రాంత ఆదాయపన్నుశాఖ అసిస్టెంట్ కమిషనరు జుత్తు తాతారావు, మల్లేశ్వరరావు, డాక్టర్ టి.బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజా గాయకుడు గద్దర్

అలరించిన ప్రదర్శనలు

రేలా రే రేలా, పల్సర్ బైక్, థింసా, బొనెలా ఆసిరయ్య జముకుల పాట, కోలాటం, బలరాం డొంగిరి మేళం, అమ్మవారి ఆట, రాజమ్మ వ్యాసం, జాలారి వ్యాసం, హరిదాసులు, ఎరుకుల పాట, చెక్కభజనలు, పీత గంగయ్య తప్పిడి గుళ్లు, తదితర కళారూపాలు ప్రేక్షకులను కనివిందు చేసాయి. అనంతరం కళాకారులు, ప్రజాప్రతినిధులకు జ్ఞాపికలు అందజేసి, సత్కరించారు.

చిరు వ్యాపారులకు బాసట

- 43,797 మందికి రూ.16.85 కోట్లు వడ్డీ జమ
- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఎవరూ దిగులు చెందాల్సిన పని లేదని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. జగనన్న తోడు, ఫేస్-4 రుణాల పంపిణీ వడ్డీ జమ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో బటన్ నొక్కి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. కలెక్టరేట్ నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ధర్మాన మాట్లాడారు. పుట్‌పాత్‌లు, ప్రజా, ప్రయివేటు స్థలాల్లో స్థలాల్లో తోపుడుబళ్లపై వ్యాపారాలు చేసుకుంటున్న వారు, తలపై గంపలో మోస్తూ అమ్ముకునే వారు, సైకిల్, మోటార్ సైకిల్, ఆటోలపై వెళ్లి వ్యాపారం చేసుకుంటున్న వారు, చేతి వత్తిదారులు, కళాకారులు, తదితర వ్యాపారులు తమ రోజువారీ వ్యాపార మూలధనం కోసం ప్రయివేటు వ్యక్తులు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తీసుకోవాల్సిన పని లేకుండా సున్నా వడ్డీకి రూ.10 వేల రుణాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరం ఫేస్-4 కింద జిల్లాలో 43,797 లబ్ధిదారులకు రూ.16.85 కోట్లు అందిస్తున్నట్లు వివరించారు. ఈ నిధులను పండగ ఖర్చుల కోసమో, కుటుంబ అవసరాల కోసమో కాకుండా చిరు వ్యాపారాలతో ఆర్థిక ప్రయోజనం పొందాలన్నారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా రుణం పొందిన 27,521 మంది లబ్ధిదారులకు రూ.58 లక్షల వడ్డీతో పాటు 43,797 మంది లబ్ధిదారులకు రూ.16.85 కోట్లు లబ్ధి చేకూరుతోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, డిసిసిబి అధ్యక్షులు కె.రాజేశ్వరరావు, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు తదితరులు

శ్రీముఖలింగానికి యునిసెఫ్ గుర్తింపునకు కృషి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జలుమూరు మండలం శ్రీముఖలింగంలోని చారిత్రక నేపథ్యం గల శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయ ప్రాచీన కట్టడాలకు యునిసెఫ్ గుర్తింపు లభించేలా ఇంటాక్ కేంద్ర కార్యాలయం ద్వారా కృషి చేయాలని జిల్లా ఇంటాక్ బృందం ప్రతినిధులు కోరారు. ఢిల్లీలో మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాపులో జిల్లా నుంచి హాజరైన ప్రతినిధులు ఈ ప్రతిపాదన చేశారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన ఇంటాక్ బృందాలుగా దేశవ్యాప్తంగా ఉన్న చారిత్రక వారసత్వ సంపదపై వర్క్‌షాపులో ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ నూక సన్యాసిరావు జిల్లాలోని ప్రాచీన కట్టడాల గురించి వివరించారు. శ్రీముఖలింగం ఆలయ కట్టడాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇంటాక్ జాతీయ అధ్యక్షులు కెప్టెన్ అరవింద్ శుక్లా నేతృత్వంలో నిర్వహించిన వర్క్‌షాపులో వావిలపల్లి జగన్నాథం నాయుడు, నటుకుల మోహన్ హాజరయ్యారు.



వర్క్‌షాపునకు హాజరైన ఇంటాక్ జిల్లా ప్రతినిధులు

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే వేటు

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధి హామీ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్‌కు సిఫార్సు చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు ఎంపిడిఒలను ఆదేశించారు. ఎంపిడిఒలు, ఉపాధి హామీతో జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష్యాల సాధనలో వెనుకబడితే సహించేది లేదని హెచ్చరించారు. ఉపాధి పనులకు కూలీలు అధిక సంఖ్యలో వచ్చే విధంగా ఎంపిడిఒలు చొరవ చూపించాలని కోరారు. ప్రతి పంచాయతీ పరిధిలో 300 నుంచి 400 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు వచ్చేలా లక్ష్యాలను నిర్దేశించడంతో పాటు టెక్నికల్ అసిస్టెంట్లు అందరూ తమ పరిధిలోని క్లస్టర్‌లో రెండు వేల మంది కూలీలతో పనులు చేయించాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో సగటు వేతనం రూ.250కి తగ్గరాదని స్పష్టం చేశారు. కూలీల హాజరును ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మాత్రమే అప్‌లోడ్ చేయాలని సూచించారు. ముందుగా వర్క్ డిమాండ్ ఇచ్చిన కూలీలు మాత్రమే పనులకు వచ్చేలా చూడాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న కుటుంబాలకు వంద రోజుల పని దినాలు కల్పించాలని ఆదేశించారు. ప్లాంటేషన్ పనులకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధను చూపించాలన్నారు. పంచాయతీ స్థాయిలో ఎన్ని మొక్కలు నాటారన్న రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు.

జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ మాట్లాడుతూ ఎంపిడిఒలు, ఉపాధి హామీ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. జిల్లా కార్యాలయం నుంచి వచ్చిన ప్రతి సమాచారాన్నీ ఎపిఒలు ఎంపిడిఒల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఉపాధి హామీ అమల్లో వేగం పెంచాలన్నారు. విజిలెన్స్ అధికారి బి.లవరాజు మాట్లాడుతూ సామాజిక తనిఖీ రికవరీలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించిన నేపథ్యంలో మండల స్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేసి రికవరీ వేగవంతం చేయాలని సూచించారు. నెలవారీ లక్ష్యాలను నిర్దేశించిన నేపథ్యంలో రికవరీలకు సహకరించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ రికవరీ చట్టం ప్రాప్తికి స్పందించని వారిపై చర్యలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో కార్యక్రమ అధికారి కె.వి అప్పలనాయుడు, ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, ఎపిడిలు మురళీకృష్ణ, శైలజ, లోకేష్, హరిత, జయరాం, ఎంపిడిఒలు, ఎపిఒలు, ఇంజినీరింగ్, టెక్నికల్ కన్సల్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ గుర్తింపు హాజరు సరికాదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజా రవాణా సంస్థ (ఆర్‌టిసి) ఉద్యోగులకు ముఖ గుర్తింపు హాజరు విధానం సరికాదని, ఈ ఆలోచనను విరమించుకోవాలని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు కోరారు. ఈమేరకు ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు బుధవారం లేఖ రాశారు. ఇతర శాఖల్లో ఉద్యోగులకు, ఆర్‌టిసిలో పనిచేసే వారికి పని విధానంలో వ్యత్యాసం ఉందన్నారు. బస్సుల్లో ప్రయాణం చేస్తున్న ఉద్యోగులు ముఖ హాజరును ఎలా వేయగలరని ప్రశ్నించారు. ఆర్‌టిసి ఉద్యోగులు 24 గంటల పద్ధతిలో పనిచేస్తుంటారని, చాలామందికి సెల్‌ఫోన్ వినియోగం తెలియదన్నారు. సాంకేతికంగా ఆర్‌టిసి ఉద్యోగులు అంతటి నైపుణ్యం కలిగి ఉండరని చెప్పారు. వాస్తవానికి రోజుకు ఎనిమిది గంటల విధులకు హాజరైన వారూ అదనపు పని గంటలు పనిచేస్తారని చెప్పారు. కర్తవ్య నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులపై ఈతరహా ప్రయోగాలు మంచిది కాదన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులపై ఈరకమైన ప్రయోగాలు నష్టదాయకంగా ఉన్నాయని తెలిపారు. ఈ విధానానికి స్వస్తి పలకాలని, లేకుంటే ఉన్నతస్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించి చర్చించాలని డిమాండ్ చేశారు.


బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

క్రీడలతో ఆరోగ్యం

ప్రజాశక్తి - కొత్తూరు

క్రీడలు ఆరోగ్యాన్ని ఇస్తాయని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వర్గీయ గొగుల చల్లంనాయుడు జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో యువత రాణించాలన్నారు. క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఈ పోటీలో జిల్లాలోని టీమ్‌తో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి టీమ్‌లు పాల్గొన్నాయి. నిర్వాహకులు గొగుల వరప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ రూ.33 వేలు, ద్వితీయ రూ.20 వేలు, ద్వితీయ బహుమతులు రూ.15 వేలు నగదు, ట్రోఫీని అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ గొగుల మాధవి, జిల్లా గ్రంథాలయ మాజీ అధ్యక్షులు లోతు నందకుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ కుంచాల రత్నాలు, వైసిపి నాయకులు పి.లక్ష్మణరావు, జి.ఆనందరావు, వి.శ్రీను పాల్గొన్నారు.


బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

బాక్సింగ్ పోటీలు ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో క్రీడా ప్రాధికారి సంస్థ ఆధ్వర్యాన జిల్లాస్థాయి శాప్ లీగ్ బాక్సింగ్ టోర్నమెంట్‌ను అండర్-14 బాలబాలికలకు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 28 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వాకర్స్‌క్లబ్ మాజీ గవర్నర్ ఇందిరాప్రసాద్, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పి.ప్రసాద్‌లు పాల్గొని పోటీలను ప్రారంభించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థల బాక్సింగ్ కోచ్ రాజీవ్‌కుమార్ పర్యవేక్షించారు. ఈ పోటీల్లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత పాల్గొని విజేతలను ఎంపిక చేశారు. అర్హత సాధించిన విజేతల జాబితాను రాష్ట్రస్థాయి శాప ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.



పతకాన్ని అందుకుంటున్న వినోద్‌కుమార్

వెయిట్ లిఫ్టింగ్‌లో 'ఆదిత్య'కు స్వర్ణం

టెక్కలి రూరల్: ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్ ద్వితీయ ఏడాది విద్యార్థి బిర్లంగి రాజశేఖర్, బిటెక్ ఐటి ఫైనల్ ఇయర్ చదువుతున్న కె.వినోద్‌కుమార్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలో బంగారు పతకాలు సాధించినట్లు డైరెక్టర్ వివి.నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిఎంఆర్ ఐటి రాజాంలో జెఎన్‌టియు కాకినాడ నిర్వహించిన ఇంటర్ కాలేజ్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల 55 కేజీల విభాగంలో రాజశేఖర్, 86 కేజీల విభాగంలో కె.వినోద్‌కుమార్ పతకాలు సాధించారని తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, పి.మురళీధర్, పీడీలు ఎస్.లక్ష్మణమూర్తి, టి.మురళీమోహన్ అభినందించారు.

సంక్రాంతి సందడి

సంక్రాంతి ముందస్తు సంబరాలు ప్రారంభమయ్యాయి. పలుచోట్ల ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. భోగి మంటలు వేసి సందడి చేశారు. ముగ్గుల పోటీల్లో విద్యార్థులు పాల్గొని అలరించారు.

కవిటి: కవిటి కొత్తూరులోని ఆర్ష విజ్ఞాన భారతి, స్థానిక కస్తూర్బా ఆంగ్ల పాఠశాల, కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇద్దివానిపాలెం, శిలగాం, బొరివంక, ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కవిటి, బొరివంక, నెలవంక ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో హరిదాసు, గంగిరెద్దుల వేషాలు వేసి అలరించారు. భోగి మంటలు వేసి సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

పద్మావతిలో...

నరసన్నపేట: స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఆనందోత్సవాల మధ్య జరిగాయి. సంక్రాంతి విశిష్టతను తెలియజేసేలా సంక్రాంతి లక్ష్మి, గాలిపటం తయారీ, బొమ్మల కొలువు, పల్లెల్లో సంక్రాంతి, భోగి, కుండల అలంకరణ, రంగోలి ఇలా వివిధ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ ఈఎం.నాయుడు, అకడమిక్ ఇన్‌ఛార్జి ముకర్ల శ్రీనివాసరావు, ఎఐ మోహన్‌దాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: పూండి గోవిందపురంలోని సాయి వినీత్ విద్యాసంస్థల్లో డైరెక్టర్ చావల కోదండరావు, రిటైర్డ్ డిప్యూటీ డిఇఒ ఆండాలమ్మ లీల ఆధ్వర్యాన ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. జెడిపి వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతంలో కళాశాల విద్యను ఆడపిల్లలకు చేరువు చేసిన ఘనత సాయి వినీత్ విద్యాసంస్థలకే దక్కుతుందని అన్నారు. విద్యతోనే సమసమాజ నిర్మాణం జరుగుతుందని ఆమె అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి సంస్కృతి సాంప్రదాయాలకు వారధిగా నిలవాలని ఆమె అన్నారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

డోకులపాడు ప్రాథమిక పాఠశాలలో చిన్నారుల సంప్రదాయ వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బుధవారం పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. దేశ నాయకుల వేషాలతో అలరించారు. గాలి పటాలను ఎగురవేశారు.

టెక్కలి రూరల్: పోలవరం జెడిపి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం డి.చిన్నారావు ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. హరిదాసు, జంగమయ్య, సోదమ్మ గ్రామీణ మహిళ వంటి పాత్రలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.వీరభద్రరావు, బి.శ్రీనివాస్, హెచ్.అనూరాధ పాల్గొన్నారు.

టెక్కలి: సంప్రదాయాలు, సంస్కృతిని నేటి విద్యార్థులకు వివరించాల్సి ఉందని రవీంద్రభారతి పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ కోరారు. పాఠశాల ఆవరణలో డీస్ నాగరాజు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గంగిరెద్దుల వేషధారణలు అలరించాయి. ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు.

మండలంలోని చాకిపల్లి, నర్సింగపల్లి, భరణాం, పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలు ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంప్రదాయ వస్త్ర ధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

ఇచ్ఛాపురం: మండపల్లి తోటూరులోని శ్రీ సత్యసాయి విద్యా సంస్థలో కరస్పాండెంట్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, గాలిపటాలు ఎగరవేయడం, కోలాటంతో ముందస్తు సంక్రాంతి శోభ సంతరించుకుంది. మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, పురుషోత్తపురం ఉన్నత పాఠశాల, జ్ఞాన భారతి విద్యా సంస్థలో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు అలరించాయి.

జూనియర్ కళాశాలలో...

సరుబుజ్జిలి : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు ఆధ్వర్యాన ముందస్తు పండగ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు కళాశాల మైదానంలో భోగి మంటలు వెలిగించి ఆనందంతో కేరింతలు కొట్టారు. సంక్రాంతి పండగ పాటలకు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి దుర్గివలస రాంప్రసాద్ విద్యార్థులతో నృత్యం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ధనుంజయరావు, చిన్నారావు, లైబ్రేరియన్ రామారావు, కృష్ణమూర్తి, రమేష్, సాహూ, వినోద్‌రాజు, శ్రీనివాసరావు, విజయ, సంగీత, అప్పలనాయుడు పాల్గొన్నారు.

రవితేజ...

లావేరు : మండలంలోని మురపాకలో రవితేజ స్కూల్ ప్రాంగణంలో డైరెక్టర్ చిన్నారావు ఆధ్వర్యాన ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చిన్నారులు డాన్సులతో అలరించారు.

పొందూరు: మండలంలోని తాడివలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమాచార్యులు ఆధ్వర్యాన భోగి మంటలతో పాటు, ముగ్గులతో ఆవరణ అంతా పండుగ వాతావరణం నెలకొంది. అలాగే పొందూరు పట్టణంలో శ్రీవేద పాఠశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం బాబూరావు, సునీత, రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే మండలంలోని వావిలపల్లిపేట వద్ద గల ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ ప్రభాకర్ ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలను నిర్వహించారు.

జి.సిగడాం : మండలంలోని ఆద్దానపేట ప్రాథమిక పాఠశాలలో, కెజిబివి, మోడల్ స్కూల్లో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ముందుగా విద్యార్థులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు, సంప్రదాయ వస్త్రధారణ, హరిదాసు, డూడూ బసవన్న వేషాలు, తప్పెట గుళ్లు, కోలాటం జానపద నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

బూర్జ : మండలంలోని ఓ.వి.పేట ఆదర్శ పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యాన విద్యార్థులు పట్టు వస్త్రాలు ధరించి గంగవల్లికలు, గొబ్బెమ్మలు వేశారు. నృత్యాలు ప్రదర్శన చేశారు. వైస్ ప్రిన్సిపాల్ చింతాడ కృష్ణారావు భోగి భోగి మంట వెలిగించారు.

పలాస: మదర్ థెరిసా పాఠశాలలో బుధవారం సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు రోలులో ధాన్యాన్ని దంచుతూ, దాని ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయురాలు పలు వంటకాలు చేశారు. అనంతరం భోగి మంటల్లో భోగి పండ్లు వేసి విద్యార్థులతో ఉల్లాసం ఉత్సాహంగా గడిపారు. వంటకాలలో గెలుపొందిన మహిళ ఉపాధ్యాయులకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగాభవాని, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో ముగ్గుల పోటీలు నిర్వహించి, అనంతరం విద్యార్థులతో భోగి మంటలు, భోగి పళ్లు, సాంప్రదాయ వస్త్రధారణ, హరిదాసు, డూడూ బసవన్న వేషాలు, తప్పెట గుళ్లు, కోలాటం జానపద నత్య ప్రదర్శనలు, అందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్‌వి.రమణారావు, కె.శ్రీనివాసరావు, శివప్రసాద్, యామిని, కిషోర్, భీమశంకర్, అరుణ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: కోసమాల ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. భోగి పళ్లు పోశారు. భోగి మంట వేశారు. రంగవళ్లులు ఆకట్టుకున్నాయి.


కవిటి : భోగి మంట వేసిన ఆర్ష విజ్ఞాన భారతి చిన్నారులు


నరసన్నపేట: భోగి మంట వేసిన పద్మావతి స్కూల్ యాజమాన్యం


పలాస : ధాన్యాన్ని దంచుతున్న మదర్ థెరిసా ఉపాధ్యాయులు


జి.సిగడాం : వివిధ వేషధారణల్లో చిన్నారులు


పొందూరు : సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న శ్రీవేద పాఠశాల చిన్నారులు


లావేరు : భోగి మంట వేసిన రవితేజ ఉపాధ్యాయులు

కాంగ్రెస్ వైపు ప్రజల చూపు

ప్రజాశక్తి - టెక్కలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాల వల్ల వారి పాలనపై ప్రజల్లో నమ్మకం పోయిందని, ప్రజలు కాంగ్రెస్ పాలన వైపు చూస్తున్నారని పిసిసి వర్కింగ్ కమిటీ అధ్యక్షులు, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం టెక్కలి నియోజకవర్గ ముఖ్యనేతలతో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి రాష్ట్రంలో ప్రారంభం కానున్న చేయిచేయి కలుపుదాం, కాంగ్రెస్‌ను నడుపుదాం ఆనే కార్యక్రమం చేపట్టనున్నామని, దాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజ్‌తో సహ విభజన హామీలు ఒక్కటీ కూడా ఆమలు జరపకపోవడం విచారకరమని అన్నారు. జనవరి 26 నుంచి మార్చి నెలాఖరు వరకు భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా జరిగే కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని, ప్రతి ఇంటికీ వెళ్లి పార్టీ పూర్వ వైభవాన్ని తేవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టెక్కలి శాసనసభ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా పేడాడ పరమేశ్వరరావు, కోత మధుసూదనరావు, చింతాడ దిలీప్ పేర్లను ఆమోదించారు. కాంగ్రెస్ పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ దిలీప్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిసిసి అధ్యక్షులు బి.సత్యవతి, పేడాడ పరమేశ్వరరావు, కోత మధుసూదనరావు, శాసుమహంతి ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.


రాకేష్‌రెడ్డితో నూతన కమిటీ సభ్యులు

మృతుల కుటుంబాలకు శిరీష పరామర్శ

పలాస, వజ్రపుకొత్తూరు: మున్సిపాలిటీలోని బాలక శ్రీను కుమార్తె వనిత, మల్లా కామేశ్వరరావు, లోళ్ల అప్పారావు, దశముఖ సత్యారావు ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాలను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష బుధవారం పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలం కొండపల్లి గ్రామంలో దాసరి మోహనరావు, చిన్నవంక గ్రామంలో రెయ్యి మహాలక్ష్మి, కొత్తపేట పంచాయతీ దిబ్బవానిపేట టిడిపి బూత్ కన్వీనర్ పెరిమల్లి సాయి తండ్రి పెరిమల్లి కృష్ణమూర్తి మృతిచెందారు. వారి కుటుంబాలను శిరీష పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి, కృష్ణనాయక్, బి.నాగరాజు, ఎస్.నవీన్, వసంతస్వామి, బి.శశిభూషన్, సూరాడ మోహనరావు, ఉమామహేశ్వరరావు, దాసరి జేజేరావు, దుర్యోధన, షణ్ముఖరావు, కేశవరావు, తదితరులు ఉన్నారు.


పరామర్శిస్తున్న గౌతు శిరీష

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి

వజ్రపుకొత్తూరు: పూండి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి యువకుడు దుర్మరణం పొందినట్లు పలాస జిఆర్‌పి ఎస్‌ఐ ఎస్‌కె.షరీఫ్ బుధవారం తెలిపారు. నందిగాం మండలం నౌగాంకు చెందిన జన్నాన తిరుపతిరావు మంగళవారం రాత్రి ప్రమాదంలో మృతిచెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళకు గాయాలు

నందిగాం: మండలంలోని దిమ్మిడిజాలకు చెందిన కొన్ని సీతమ్మ బుధవారం ఆటోలో నుంచి జారిపడి గాయపడింది. సీతమ్మ సంక్రాంతి సందర్భంగా నూతన దుస్తులను కొనుగోలు చేసుకునేందుకు టెక్కలి వెళ్లింది. తిరిగి ఆటోలో వస్తుండగా... దిమ్మిడిజోల వద్ద జారి పడిపోవడంతో కుడి చేయి విరిగిపోయింది. వెంటనే స్థానికులు టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ మహమ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మంత్రితో ఆర్అండ్‌బి ఉద్యోగులు

మంత్రిని కలిసిన ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్ : రహదారులు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టిరాజా ఆర్అండ్‌బి ఉద్యోగుల కేలండర్, డైరీలను బుధవారం ఆవిష్కరించారు. అనకాపల్లి జిల్లా తునిలో ఆయన స్వగృహంలో మంత్రిని ఆర్అండ్‌బి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్‌పాపారావు నేతృత్వంలో నాయకులు కలిశారు. మంత్రిని కలిసేందుకు తోడ్పాటు అందించిన ఆలీ అజ్గర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వి.రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థుల ప్రతిభ

టెక్కలి: మండలంలోని పెద్దసాన ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తైక్వాండో సౌత్ ఇండియా ఛాంపియన్ షిప్ పోటీల్లో సత్తా చాటారని వ్యాయామ ఉపాధ్యాయుడు పాండవుల జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను బుధవారం పాఠశాలలో అభినందించారు. ఈ నెల 6,7,8 తేదీల్లో తెలంగాణలో జరిగిన పోటీల్లో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. 33-35 కిలోల విభాగంలో రాజాన ఢిల్లీశ్వరి బంగారు పతకాన్ని సాధించగా, 35-37 కిలోల విభాగంలో బోడ్డేపల్లి మాధురి రజత పతాకం, వ్యాయామ ఉపాధ్యాయుడు జగదీష్ 74-80 కిలోల విభాగంలో పాల్గొని వెండి పతకాన్ని సాధించారు. వీరిని హెచ్‌ఎం టి.అబ్దుల్ స్వామి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పింఛను పంపిణీ

కోటబొమ్మాళి: మండలంలోని జీయన్నపేట పంచాయతీ తర్లిబొడ్డపాడుకు చెందిన మానసిక వికలాంగుడు చల్ల గోవిందకు పింఛను మంజూరు చేసినట్లు పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళీధర్ తెలిపారు. బుధవారం ఉప సర్పంచ్ బలగ సూర్యారావు ఆధ్వర్యాన పింఛను డబ్బులను అందజేశారు. కొన్ని కారణాల వల్ల గోవిందకు పింఛను మంజూరు కాలేదు. దువ్వాడ శ్రీనివాస్‌కు మురళీధర్ తెలపడంతో సిఎంఒ కార్యాలయానికి వెళ్లి ఆయన దగ్గరుండి పింఛను మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులకు కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో చిన్నసాన సర్పంచ్ ప్రతినిధి బి.యల్లయ్య, కె.నర్సింహమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్షేమంగా చేరిన మాల్దీవుల బాధితులు


ఎంపీతో మాట్లాడుతున్న మాల్దీవుల బాధితులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధి కోసం మాల్దీవులకు వెళ్లి అక్కడ సమస్యల్లో చిక్కుకున్న 53 మంది భారతీయ కార్మికులు స్వస్థలాలకు బుధవారం చేర్చారు. ఇటీవల ఎంపీ రామ్మోహన్ నాయుడు భారత విదేశాంగ మంతృత్వశాఖ మంత్రి, ఉన్నతాధికారులతో చర్చించిన తరువాత వీరిని క్షేమంగా స్వస్థలాలకు తీసుకొచ్చారు. వారిలో జిల్లాకు చెందిన నలుగురు కార్మికులు బుధవారం స్వస్థలానికి చేరుకున్నారు. అనంతరం నేరుగా శ్రీకాకుళంలోని ఎంపీ క్యాంపు కార్యాలయం ప్రజాసదన్‌కు చేరుకుని ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.


మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శ

నగరంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విశ్రాంత కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సకలాభక్తుల పెద్ద సన్యాసిలింగం కుటుంబ సభ్యులను ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు బుధవారం పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు కొర్ను ప్రతాప్, మెండ దాసునాయుడు ఉన్నారు.


గ్రామాభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి - జలుమూరు

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని కరవంజ పంచాయతీ మట్టవానిపేటలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, వైసిపి కన్వీనరు మొజ్జాడ శ్యామలరావు, అల్లాడ, చల్లవానిపేట, పిఎసిఎస్ చైర్మన్లు పి.ముసలినాయుడు, పి.రాజప్పలనాయుడు, ధర్మాన జగన్మోహన్‌రావు, జుత్తు నేతాజీ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

పిఎసిఎస్ వద్ద రైతుల నిరసన


నిరసన తెలుపుతున్న రైతులు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

పగలు, రాత్రి తేడా లేకుండా కష్టపడి సాగుచేయగా పండిన ధాన్యాన్ని కొనేందుకు ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని, ప్రభుత్వ తీరును నిరసిస్తూ పిఎసిఎస్ కార్యాలయం వద్ద రైతులు బుధవారం నిరసన తెలిపారు. బెల్లుపడ ప్రాంతానికి చెందిన 1400 ఎకరాల్లో రైతులు వరి పండించగా 15వేల బస్తాల దిగుబడి వచ్చింది. అధికారులు అరకొరగా ధాన్యం కొనుగోలు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దెకు ట్రాక్టర్లు మాట్లాడుకొని తూనిక చేసుకొని సిద్ధంగా ఉన్నప్పటికీ ధాన్యం తీసుకోకపోవడం వల్ల రైతులు మండిపడుతున్నారు. ట్రాక్టర్లు మీద రెండు, మూడు రోజులు పాటు ఉంటే వారికి అద్దె చెల్లించడానికి సరిపోతోందని అన్నారు. మండలంలోని బిర్లంగి గ్రామ పంచాయతీ రైతులు టిడిపి వారు కావడంతో ధాన్యం అస్సలు కొనుగోలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలోనూ రాజకీయాలు ఏమిటని రైతులు బి.సూర్యనారాయణ, జోగులు వెంకటేష్, లోకనాథం, విశ్వనాథ్ ఆందోళన చేపట్టారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ గ్రామంలో 5వేల ఎకరాల్లో 500మంది రైతులు పండించిన ధాన్యం బస్తాలు కొనుగోలు చేయకపోవడం శోచనీయమన్నారు.


ఆమదాలవలస : ప్రారంభిస్తున్న రవికుమార్

రావికంటిపేటలో క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆమదాలవలస


పురపాలక సంఘ పరిధిలోని రావికంటిపేటలో వైసిపి నియోజకవర్గ నాయకులు చింతాడ రవికుమార్ అధ్యక్షతన జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఉత్తరాంధ్ర వాలీబాల్, జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను బుధవారం ప్రారంభించారు. ముందుగా ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.సుందరరావు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండగ వాతావరణంలో ఇటువంటి గ్రామీణ స్థాయి క్రీడలను ప్రోత్సహించడం శుభ పరిణామమన్నారు. ఇటువంటి క్రీడా పోటీలను నిర్వహించిన రవికుమార్‌ను అభినందించారు. ఈ క్రీడల్లో కబాడీ పోటీలకు 60 టీమ్‌లు పాల్గొనగా, వాలీబాల్‌కు 32 టీమ్‌లు పాల్గొన్నట్లు క్రీడా నిర్వాహకులు తెలిపారు. తొలుత కబడ్డీ పోటీల్లో గొల్లపేట, శివరాంపురం టీమ్‌లు తలపడగా, శివరాంపురం జట్టు గెలుపొందింది. అనంతరం నిమ్మతొర్లాడ, చాపురం టీమ్‌లు తలపడగా, చాపురం టీమ్ లీగ్ పోటీల్లో గెలుపొందింది. అలాగే వాలీబాల్ పోటీలకు పాత్రునివలస, స్టేడియం-ఎ టీమ్‌లు తలపడగా, స్టేడియం-ఎ టీమ్ గెలుపొందింది. బలగ, రావికంటిపేట టీమ్‌లు పాల్గొనగా, బలగ టీమ్ లీగ్ మ్యాచ్‌లో గెలుపొందింది. ఈ క్రీడలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో రిఫరీలుగా ఎం.తిరుపతిరావు, ఆర్.లక్ష్మంనాయుడు, ఎన్.రమేష్, ఎస్.నీలయ్య, పి.పావని, పి.తవిటమ్మ, వెయ్యి మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు.

రాపాకలో...

పొందూరు: మండలంలోని రాపాకలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. జిల్లాలోని పలు మండలాలకు చెందిన 40 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున యువకులు, పెద్దలు తరలివచ్చారు.

20 నుంచి సమ్మె

శ్రీకాకుళం అర్బన్ : గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగాల్లో 23 ఏళ్లుగా పనిచేస్తున్న జిల్లా నీటిసరఫరా కార్మికులు ఈ నెల 20 నుంచి సమ్మెకు వెళ్లనున్నారు. అందులో భాగంగా జెడ్‌పిలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయను బుధవారం కలిసి సమ్మె నోటీసును అందజేశారు. జిల్లా వ్యాప్తంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా నియమితులై సోంపేట సిపిడబ్ల్యుఎస్, బొరువంక, టి.శాసనాం, ఉద్దానం పేజ్-1, పేజ్-2, గార, నైర, ఎచ్చెర్ల, కిల్లిపాలెం, పోలాకి వాటర్ స్కీమ్‌ల్లో పనిచేస్తున్నామని అన్నారు. 24 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆమెకు వివరించారు. పెండింగ్‌లో ఉన్న 24 నెలల వేతనాలు చెల్లించాలని, కార్మికులను ఆప్కాస్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ఇఎస్‌ఐ, పిఎఫ్ వంటి సౌకర్యం కల్పించాలన్నారు. నోటీసు అందజేసిన వారిలో సంఘం అధ్యక్షులు కె.నీలాచలం, కార్యదర్శి ఎం.వైకుంఠరావు, సిహెచ్.కిషోర్, కె.రాజశేఖర్, కె.రాజు పాల్గొన్నారు.


సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

మహిళా సంఘాలు పటిష్టం కావాలి

బూర్జ: స్వయం శక్తి సంఘాలు పట్టిస్తూ కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐకెపి ఎపిఎం బాబూరావు అన్నారు. స్థానిక ఐకెపి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జూమ్‌లో మావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత మహిళల పటిష్టానానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఒ ఎపిఎంఎస్ మనీ కో-ఆర్డినేటర్ మురళి, సుజాత, ఎంఎస్ఒబిఎస్ రమణ, ఎ.కళ్యాణి, ఎస్.రోజా, సిసిఎస్ జి.స్వామినాయుడు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలి

శ్రీకాకుళం అర్బన్ : తైక్వాండో క్రీడాకారులు జిల్లా ఖ్యాతిని నిలబెట్టేలా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని న్యాయవాది నౌపడ విజయ్ కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడలో గల కోట్ల విజయ్ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఈ నెల 6,7,8 తేదీల్లో ఇండియా తైక్వాండో ఫెడరేషన్ ఆధ్వర్యాన ఫస్ట్ సౌత్ ఇండియా తైక్వాండో ఛాపియన్ షిప్-23 పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో క్రీడాకారులు పాల్గొని సత్తా చాటారు. సబ్ జూనియర్స్, క్యాడెట్, జూనియర్స్, సీనియర్ విభాగాల్లో 35 మెడల్స్ సాధించారు. ఈ మేరకు నగరంలోని శ్రీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో వివిధ క్రీడల్లో ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి కీర్తి తెచ్చారన్నారు. వారి బాటలోనే తైక్వాండో క్రీడాకారులు రాణించాలన్నారు. కార్యక్రమంలో జి.వెంకటేశ్వరరావు, ఎం.సుధీర్‌వర్మ, కెల్ల చిన్ని, ఎస్,గోవిందరాజులు నాయుడు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

సబ్ జూనియర్ బాలురు, బాలికల విభాగంలో పి.మనీష్‌రాజ్ సింహా (గోల్డ్), ఎన్.గీత్విక్ (సిల్వర్), ఎల్.హర్ష (సిల్వర్), ఎస్.యశ్వంత్ (బ్రాంజ్), ఎం.కౌశిక్ (బ్రాంజ్), ఎల్.నిహాల్ (బ్రాంజ్) మెడల్స్ సొంతం చేసుకున్నారు. బాలికల విభాగంలో టి.రోషిత (సిల్వర్), డి.జోషిణి (బ్రాంజ్)లు దక్కించుకున్నారు. క్యాడెట్ విభాగంలో జె.నర్సింగరావు (గోల్డ్), ఎం.రోషిశరోణ్ (గోల్డ్), శిమ్మ నవ్య (గోల్డ్), దిబ్బ మేఘన (సిల్వర్), బండి శిరీష (సిల్వర్), బి.జాహ్నవి సాయికిరణ్మయి (బ్రాంజ్), వి.బేబిషామిలి (బ్రాంజ్)లు మోడల్స్ కైవసం చేసుకున్నారు. జూనియర్ విభాగంలో జి.ఉదయ్‌శంకర్ నాయుడు (గోల్డ్), డి.హారీష్ కుమార్ (సిల్వర్), శాలిహుండం సమిత్ (సిల్వర్), సతివాడ పవన్ (బ్రాంజ్), వాడాన జగదీశ్వరరావు (బ్రాంజ్), వైశ్యరాజు జాస్మిన్ (గోల్డ్), యారబాటి మౌనిక (గోల్డ్), షర్మిన్ (సిల్వర్), కె.ఎస్.భవాని (సిల్వర్), కె.శ్రావణి (సిల్వర్)లు మెడల్స్ సాధించారు. సీనియర్ విభాగంలో ఎం.చైతన్య సాయి (బ్రాంజ్), పి.సురేష్ (బ్రాంజ్), ఐ.తేజేశ్వరరావు (బ్రాంజ్), ఎస్.అప్పన్న (బ్రాంజ్), ఆర్.రమా (బ్రాంజ్), షరీన్ (సిల్వర్)లు పోటీల్లో రాణించి మెడల్స్ సొంతం చేసుకున్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న విజయ్ కుమార్


పట్టాలను అందజేస్తున్న చిరంజీవినాగ్

సర్వేతో భూ వివాదాలు పరిష్కారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

వందేళ్ల తర్వాత చేపట్టిన ఈ సమగ్ర భూ సర్వే ద్వారా దశాబ్ధాలుగా ఉన్న భూ వివాదాలు పరిష్కారమవుతాయని యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. మండలంలోని కట్యాచార్యులపేట పంచాయతీ పరిధిలోని హనుమంతపురం బౌండరీ పరిధిలో భూ సర్వేను పూర్తి చేసి పట్టాలను సచివాలయంలో హక్కుదారులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ సర్వేను చేపట్టారని తెలిపారు. డ్రోన్సు రోవర్లు వంటి అత్యాధునిక పరికరాలతో ఈ సర్వేను పూర్తి చేస్తున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, చిలకలపల్లి సురేష్, రిసర్వే డిప్యూటీ తహశీల్దార్ బాడాన శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


బోరుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి- నందిగాం

గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నందిగాం ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని కంచివూరులో మంచినీటి బోరు ఏర్పాటుకు పిఎసిఎస్ అధ్యక్షులు కె.బాలకృష్ణారావు, సర్పంచ్ కె.ఎర్రన్నతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపిపి మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి ద్వారా నీరు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఎ.విష్ణు, పి.ఆశారాణి, కె.రామచంద్రుడు, కె.గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

'అపోటా'కు ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలి

ప్రజాశక్తి- కవిటి

రికగ్నైజేషన్ ఆఫ్ సర్వీసెస్ అసోసియేషన్స్(రోసా) నిబంధనల్లో మినహాయింపు ఇచ్చి, ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్(అపోటా)కు ప్రభుత్వ గుర్తింపు కల్పించాలని అపోటా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ బరాడో, బృందావన్ దొలై రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వారు బుధవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు ప్రభుత్వస్త్ర గుర్తింపు ఇచ్చేందుకు విడుదలైన జిఒ 264 ఉప్రకారం రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు గుర్తింపు ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ రాష్ట్రంలోని ఏకైక ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ ఉపాధ్యాయ సంఘం అపోటాకు అది లేకపోవడం శోచనీయమని వారు తెలిపారు. ఒడియా విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అపొటా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మిగతా సంఘాల వలే అపోటాకు గుర్తింపు కల్పించాలని కోరారు.


చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

శ్రీకాకుళం : కోవిడ్ సమయంలో విధి నిర్వహణలో భాగంగా వైరస్ బారినపడి మృతి చెందిన కుటుంబ సభ్యులకు మ్యాన్ కైండ్ ఫార్మా సంస్థ ఆదుకోవడం అభినందనీయమని ఎస్‌పి జి.ఆర్.రాధిక అన్నారు. ఎస్‌పి కార్యాలయంలో మృతి చెందిన హోంగార్డు జి.మహేష్‌రావు సతీమణి శైలజకు రూ.3 వేలు చెక్కును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి టి.పి.విఠలేశ్వరరావు, ఎఒ శివరామరాజు పాల్గొన్నారు.

సిఆర్‌టి నియామకాలపై స్పష్టత ఇవ్వాలి

టెక్కలి: సీతంపేట ఐటిడిఎ పరిధిలోని పలు పాఠశాల్లో నియమించిన 24మంది సిఆర్‌టిల నియామకాలపై స్పష్టత ఇవ్వాలని గిరిజన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు సవర చొక్కారావు కోరారు. విజయవాడలోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ని బుధవారం కలిసి వినతిపత్రం ఆందించినట్లు తెలిపారు. టెట్ అర్హత లేకుండానే కొందరు సిఆర్‌టిల నియామకంపై ఇచ్చిన ఆదేశాలను సితంపేట ఐటిడిఎ కార్యాలయంలో అందజేయాలని సూచించినట్లు తెలిపారు. టెట్ అర్హత లేనివారికి ఉద్యోగాలు కల్పించారని, వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జెసిఎస్ మండల ఇన్‌ఛార్జిగా వెంకటరమణ


వెంకటరమణ

జి.సిగడాం : వైసిపి సీనియర్ నాయకుడు చెట్టుపొదిలాంకు చెందిన డోల వెంకటరమణను జెసిఎస్ మండల ఇన్‌ఛార్జిగా అధిష్టానం నియమించింది. ఈ మేరకు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో (జెసిఎస్) ఏర్పాటైందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. వెంకటరమణ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను తుచ తప్పకుండా నిర్వహిస్తానని అన్నారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో పర్యవేక్షించి పార్టీ బలోపేతంకు కృషి చేస్తామని తెలిపారు. వెంకటరమణ నియామకంపై ఎంపిపి మీసాల సత్యవతి, జెడ్‌పిటిసి కాయల రమణ, వైసిపి మండల అధ్యక్షులు బూరాడ వెంకట రమణ అభినందించారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుంటే ఆర్థిక ప్రయోజనం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యువత వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు పొంది ఆర్థికంగా బలపడతారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పేర్కొన్నారు. ఎచ్చెర్ల టిటిడిసి, మహిళా ప్రాంగణంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. యువత కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి తమ వృత్తిలో నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. మహిళలకు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ అండగా ఉంటుందన్నారు. ఆర్థికపరమైన సమస్యలు ఉన్న వారు న్యాయవాదిని సొంతంగా పెట్టుకుంటే వారికిచ్చే ఫీజు న్యాయ సేవ అధికార సంస్థ చెల్లిస్తుందని తెలిపారు. ఆర్థిక కారణాలతో న్యాయం పొందలేకపోతున్నామని తెలిపారు. అనంతరం



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

అంపోలు జిల్లా కారాగారాన్ని సందర్శించి అక్కడ నిందితులకు, రిమాండ్ ఖైదీలకు అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిటిడిసి ఇన్‌ఛార్జి సింహాద్రి నాయుడు, ట్రైనర్ ప్రియా పాల్, న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్, సోషల్ వర్కర్ మంత్రి వెంకటస్వామి, జైలర్ దివాకర్‌నాయుడు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సిఐ ఈశ్వర్ చంద్ర ప్రసాద్ అన్నారు. సిఐగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రదేశాలను గుర్తించి, నివారణ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణకు అన్ని చర్యలూ తీసుకుంటామని తెలిపారు.. ముఖ్య కూడళ్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రా- ఒడిశా సరిహద్దు కావడం వల్ల నేరాల నియంత్రణకు గట్టి నిఘా, రాత్రిపూట గస్తీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఆయనతోపాటు ఎస్‌ఐ గోవిందరావు ఉన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సిఐ ఈశ్వర్ చంద్ర ప్రసాద్

సిఐ ఈశ్వర్‌చంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక బస్టాండ్ జంక్షన్ వద్ద ఆటో కార్మికులతో ట్రాఫిక్ నిబంధనలపై పలు సూచనలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపినా, డ్రైవింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రయాణికులు తరలించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని అన్నారు.

అక్రమంగా కంకర తవ్వకాలు

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని పురుషోత్తపురం గ్రామం వద్ద పుష్పగిరి కొండపై ఎటువంటి అనుమతులు లేకుండా జోరుగా కంకర తవ్వకాలు సాగుతున్నాయి. ఇచ్ఛాపురం పట్టణంలోని లేఅవుట్లు ఉండటం వల్ల కంకరకు మంచి డిమాండ్ ఉంది. దీన్ని ఆసరాగా చేసుకున్న అక్రమార్కుల కళ్లు పుష్పగిరి కొండపై పడింది. ఇష్టారాజ్యంగా వారు తవ్వకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. మొన్నటివరకు రత్తకన్నలోని పీర్లకొండ వద్ద భారీగా తవ్వకాలు జరిపి, కొండను తొలిచివేశారు.


కంకరను తవ్వుతున్న అక్రమార్కులు

ఇప్పుడు వారి కళ్లు ఈ కొండపై పడ్డాయి. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోకుంటే కొండ కనిపించకుండా పోయే ప్రమాదముందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిరు వ్యాపారులకు అండగా 'జగనన్న తోడు'


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

చిరు వ్యాపారులకు అండగా జగనన్న తోడు నిలిచిందని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అన్నారు. మున్సిపాలిటీలోని 12, 13 వార్డులకు బెల్లుపడా సచివాయలంలో మెప్మా ఆధ్వర్యాన జగనన్న తోడు పథకం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఆమె మాట్లాడుతూ చేతివృత్తులను ప్రోత్సహించేందుకు లబ్ధిదారుల ఖాతాలో రూ.10వేలు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకొని, వ్యాపారాభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు రమేష్, మెప్మా సిఎంఎం జానకిరావు, సచివాలయ సెక్రటరీలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

'ఐతమ్' అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న దమరసింగు అప్పారావుకు ఆంధ్రా యూనివర్శిటీ పిహెచ్‌డి పట్టాను మంజూరు చేసిందని కళాశాల డైరెక్టర్, ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'యస్పర్మెంటల్ ఇన్వెస్టిగేషన్స్ ఆన్ మేరేజింగ్ స్టీల్ మెటల్ డిపోజిషన్ యూజింగ్ డైరెక్ట్ మెటల్ లేజర్ సింటెరింగ్' అనే అంశంపై డాక్టర్


అప్పారావు

ఎం.వి.జగన్నాథరాజు మార్గదర్శకత్వంలో చేసిన పరిశోధనకు ఎయు ఈ పట్టాను జారీ చేసిందన్నారు. డాక్టర్ దమరసింగు అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్.శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆరెస్డీ డాక్టర్ కె.బి.మధుసాహు, డీన్ డాక్టర్ డి.ఆజాద్, మెకానికల్ హెచ్‌ఐడి డాక్టర్ డి.శ్రీరాములు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

తెగుళ్లపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చేపేనపేటలో మినుము పంటలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిరంజీవి పెస్ట్ సర్వేలైన్ కార్యక్రమం బుధవారం చేపట్టారు. పురుగులు, తెగుళ్లపై నిఘా పెట్టామని తెలిపారు. పంటల్లో వచ్చే పురుగులు, తెగుళ్లను గుర్తించి వాటిని ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నియంత్రణపై రైతులకు పూర్తిస్థాయిలో వివరించామని పేర్కొన్నారు. పంటల్లో వచ్చే పురుగులు, తెగుళ్ల నియంత్రణపై రైతులకు పూర్తి అవగాహన కల్పించామన్నారు.


పెస్ట్ సర్వే లైన్ నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రకృతి సేద్య విధానంలో మెరుగైన పద్ధతులను పెస్ట్ సర్వే ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, తిరుపతి, మల్లేష్, లక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆశాజనకంగా అపరాలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అపరాల సాగు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రబీలో వరి పంటకు అందించిన నీటితోనే పెసర, మినుము విత్తనాలు రైతులు సాగు చేస్తున్నారు. మరో వైపు కొద్ది రోజులుగా కురుస్తున్న మంచుతో పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. 1600 మినుము, 780 ఎకరాలు పెసర పంటను సాగు చేస్తున్నారు. అపరాల పంటకు ఎంత నీటిని అందిస్తే అంత దిగుబడిలో వస్తాయని, మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఎఒ రాజేశ్వరరావు తెలిపారు. పంటలకు కలుపు నివారణ, సస్యరక్షణకు వ్యవసాయశాఖ అధికారులు సూచించిన సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మినుము, పెసర పంటలకు ప్రధానంగా ఆశించేది బూడిద తెగులు తెలిపారు. గాలిలో తేమ శాతం


ఏపుగా ఉన్న మినుము పంట

ఎక్కువగా ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాపిస్తుంటాయని చెప్పారు. సిబ్బంది సూచించిన పురుగు మందులను పిచికారీ చేస్తే తెగుళ్ల నివారణ సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న మంచు వల్ల అపరాల పంటకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. ఫిబ్రవరిలో దట్టమైన పొగ మంచు కురిస్తే నష్టం వాటిల్లివచ్చునని, కానీ, అప్పటికే పిందె కట్టడం వల్ల ఎటువంటి నష్టం ఉండదని తెలిపారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఆపస్ కేలండర్ ఆవిష్కరణ

కవిటి: స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద ఆపస్ డైరీ, కేలండర్‌ను ఎంఇఒ ధనుంజయ మజ్జి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఆపస్ ఎనలేని కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కవిటి మండల ఆపస్ అధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆనింగి నాగేశ్వరరావు, జిల్లా కోశాధికారి నర్తు సోమేశ్వరరావు, హెచ్ఎం సదానంద గౌడ్, సంతోష్, శరత్, ప్రకాష్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


మందులను అందజేస్తున్న సర్పంచ్ పోలినాయుడు

142 మందికి వైద్య పరీక్షలు

పొందూరు: పొందూరు మండలంలోని పిల్లలవలసలో సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు ఆధ్వర్యాన రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన బుధవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 142 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతర్లకు భారీ బందోబస్తు

రణస్థలం : ఈ నెల 15,16,17 తేదీల్లో కోటపాలెంలో నిర్వహిస్తున్న భద్రమహంకాళమ్మతల్లి, ఈ నెల 31, ఫిబ్రవరి 1,2 తేదీల్లో కమ్మసిగడాం శ్రీమహాలక్ష్మి తల్లి జాతర్లకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లున్నట్లు సిఐ ఎస్.ఆదాం ఒక ప్రకటనలో తెలిపారు. జాతర్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్‌పై పటిష్ట చర్యలు తీసుకుంటామని, ఎటువంటి రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించి బుధవారం నిరసన తెలిపారు. సంక్రాంతి పండుగకు కూడా తమకు వేతనాలు లేకపోతే పండగ ఎలా చేసుకోవాలి అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇఒ దీర్ఘకాలిక సెలవుపై ఉండడంతో సిబ్బంది వేతనాలకు ఇబ్బంది ఏర్పడినట్లు తెలుస్తుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై కార్మికులు టెక్కలి సబ్ కలెక్టర్‌ను కలిసి వివరిస్తామని కార్మికులు తెలిపారు.


దుస్తులను పంపిణీ చేస్తున్న సన్యాసిరావు

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- పొందూరు

మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిదని సర్పంచ్ పైడి రాంప్రసాదరావు, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావులు అన్నారు. మండలంలోని కింతలిలో దుంపల వెంకటసత్యనారాయణ, లక్ష్మీకాంతంల జ్ఞాపకార్థం వారి కుమారుడు, విశ్రాంత ఉపన్యాసకులు సన్యాసిరావు 130 మంది పేదలకు బుధవారం దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎలియన్స్ క్లబ్ సభ్యుల వితరణ

ఇచ్ఛాపురం: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఓ టీ షాపులో పని చేస్తున్న గుడియా శ్రీను పక్షవాతంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎలియన్స్ క్లబ్ సభ్యుడు బాలకృష్ణ వాకింగ్ స్టాండ్‌ను, బత్తుల వెంకటరమణ రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని సంస్థ తరుపున అందించారు. చలి నుండి రక్షణకు దుప్పటి అందించారు. సంస్థ అధ్యక్షులు ఎల్.నరసింహమూర్తి, కార్యదర్శ లక్ష్మణరావు, కోశాధికారి సత్యమయ్య, పిఆర్‌ఒ దక్కత గోపీనాథ్‌రెడ్డి, ఉమా శంకర్, రమణ, ప్రకాష్, రవి, బాల, బి.వాసు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రమణ

బొబ్బిలిపేటలో పారిశుధ్య పనులు

ఆమదాలవలస : మండలంలోని బొబ్బిలిపేటలో సర్పంచ్ గొండు రమణ ఆధ్వర్యాన బుధవారం పారిశుధ్య పనులను నిర్వహించారు. గ్రామంలోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తీయించి చెత్త కేంద్రానికి తరలించారు. గ్రామంలోని వీధుల్లో బ్లీచింగ్ వేయించి క్లోరినేషన్ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చేశామన్నారు. గ్రామంలోని రోడ్లను శుభ్రం చేయించారు. నీరు నిల్వ ఉంటే దోమలు చేరి వ్యాధులు దరిచేరుతాయని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

ఆలిండియా శిష్టకరణ సంఘం

సెక్రటరీగా శ్రీనివాస్ పట్నాయక్


శ్రీనివాస్‌పట్నాయక్

శ్రీకాకుళం అర్బన్ : ఆల్ ఇండియా శిష్టకరణం సెక్రటరీగా ఫిజియోథెరపిస్టు డాక్టర్ బగ్గం శ్రీనివాస్ పట్నాయక్ నియమిస్తూ ఆల్ ఇండియా శిష్టకరణం అధ్యక్షులు డబ్బీరు వెంకట కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు స్వచ్ఛంద సేవాసమితి ద్వారా ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీనివాస్ పట్నాయకును కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిష్టకరణాల్లో ఇప్పటికీ చాలామంది ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, వారి సర్వతో అభివృద్ధికి, ఒబిసి సాధనకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయంలో బుధవారం స్వామి వివేకానంద జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ నెల 12వ తేదీన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈ పోటీలు నిర్వహించామని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

సత్యనారాయణకు అభినందనలు

నరసన్నపేట: మండల కేంద్రానికి చెందిన న్యాయవాది సత్యనారాయణను ప్రభుత్వం ఎజిపిగా నియమించడంతో శిష్టకరణ సంఘం ప్రతినిధులు, పలువురు న్యాయవాదులు బుధవారం అభినందించారు. దుశ్శాలువతో ఆయనను సత్కరించారు. ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. సత్కరించిన వారిలో విశ్రాంత జడ్జి సదాశివుని ప్రభాకరరావు, శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, ఎంపిడిఒ డివి.రఘు, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

ఆమదాలవలస: పట్టణ పరిధిలోని 4వ వార్డు గేదెలపేటలో మంగళవారం రాత్రి తోట బుచ్చిబాబు (43) మృతి చెందారు. బుధవారం ఆయన కుటుంబానికి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు నగదును మృతుని భార్య పద్మకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సాధు కామేశ్వరరావు, వార్డు సంక్షేమ, సహాయ కార్యదర్శి ఐ.కుమారస్వామి, ఆర్‌పి ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కళావెంకటరావు పరామర్శ

జి.సిగడాం : మండలంలోని మదుపాంకు చెందిన సర్పంచ్ బోగాది అప్పలనాయుడు తల్లి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు బుధవారం ఆయనను పరామర్శించారు. టిడిపి మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్, నాయకులు ఉన్నారు.